# తాళి

గొల్లపూడి రాజ్యలక్ష్మి

అది లంచ్ టైం. అన్ని డిపార్ట్‌మెంట్లల్లోని ఆడవాళ్లమంతా రెస్ట్ రూంలో కల్సుకుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ లంచ్ బాక్సులు ఖాళీ చేయడం మామూలే. అయితే ఆ కార్యక్రమం మరీ రొటీన్‌లా మారకుండా అప్పుడప్పుడూ వెరైటీగా మారుస్తుంటారు శాంత, భారతిలు.

"ఇవాళ నీ మెడ ధగ ధగ లాడిపోతోందేమిటి?" అనడిగింది భారతి.

"మొన్నామధ్య పుస్తెలతాడు అరిగిపోయిందని చెప్పాను కదా! అది మార్చి మరో మోడల్ చేయించాను. ఇవాళ శుక్రవారం కదా! దేవుడి దగ్గర పెట్టి పూజ చేసి వేసుకున్నాను!" అన్నది శాంత.

"ఏదో కొత్త డిజైన్‌లా వుందే! ఏది ఇలా తీసివ్వు చూస్తాను!" అంది భారతి.

"ఎలా ఇవ్వను?" అంది ఇబ్బందిగా.

"ఎలా ఏమిటి? ఇలా పైకి తీసి ఇవ్వొచ్చుగా."

"కుదరదు... మెళ్లోంచే చూడు."

"ఓహో... 'తాళి' సెంటిమెంటా?" అంటూ పెద్దగా నవ్వింది భారతి.

"ఇలా అసందర్భంగా నవ్వితే నాకు ఒళ్లు మండుతుంది." అన్నది కాస్త ముఖం చిట్లించి శాంత.

"అసందర్భంకాదు. నీ అమాయకత్వం, అజ్ఞానం... నిజానికి జాలిపడాలి. పోనీకదా అని నవ్వాను!"

"అసలేమిటి నీ ఉద్దేశం?" అంది బాక్స్ పక్కన పెట్టి భారతివైపు పూర్తిగా తిరిగి శాంత.

"నా ఉద్దేశానికేమిటిలేగానీ- ఆమధ్య ఈ 'తాళి' సెంటిమెంట్‌తో ఏదో ఒక సినిమా వచ్చినట్టుంది కదూ!" అన్నది భారతి జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

"ఒకటేమిటి? చాలా వచ్చాయి. వస్తున్నాయి... వస్తాయి!"

"ఔనుమరి... నీలాంటివాళ్లను ఆకర్షించి థియేటర్‌దాకా లాక్కుపోవాలంటే అలాంటివి తీయక ఛస్తారా! తప్పదు మరి!"

"నీలాంటి' అంటూ ఆ చురక ఎందుకుట? మెళ్లోంచి గొలుసు పైకి తీయనన్నాననేగా?" అంది కాస్త రోషంగా శాంత.

"అనే!" అంది వత్తిపలుకుతూ.

"నువ్వు మరీ చోద్యం భారతీ! ఏ ఆడదైనా మరీ అంత బరితెగించి ప్రవర్తిస్తుందా?" అంది, అంతా వింటున్న సుమతి.

"మాటి మాటికీ పైకి తీసి వేసుకోవటానికి ఇదేమైనా మామూలు గొలుసా? 'తాళిబొట్టు' అంటారు. అవునా? అబ్బ... ఈ గంభీరమైన డైలాగ్ కూడా ఏదైనా సినిమాలోకి పనికి వస్తుంది సుమా!" అంది నవ్వుతూ భారతి.

"అర్థంలేకుండా మాట్లాడకు!" అంది కాస్త కోపంగా శాంత.

"నేనా మాట్లాడేది?"

"ఇవాళేమిటి... నీ ధోరణి నాతో మొదలైంది?"

"ఎక్కడో అక్కడ ఏదో ఒక పనికిమాలిన సెంటిమెంట్ చూస్తే నాకే పూనకం వస్తుంది మరి. ఏం చేయను?"

"ఏం చేయొద్దు. భోంచేయి!"

"వుండు. ఈ విషయం ఏదో తేల్చుకోకుండానే..?" అంది పట్టుదలగా.

"ఏవిటి తేల్చుకునేది?"

"అదే! 'తాళి' సెంటిమెంట్ గురించి" అంది భారతి.

"చూడు భారతీ! అంత సరదాగా వుంటే ఇంకా వేరే ఏదైనా విషయం లేవనెత్తు. అంతేగానీ దీని జోలికి మాత్రం రాకు." అంది సీరియస్‌గా.

"ఎందుకంత భయం? కాస్త రీజనబుల్‌గా ఆలోచించటానిక్కూడా భయమేనా?"

"మనకంటూ కొన్ని నమ్మకాలూ- విశ్వాసాలూ వున్నాయి. వాటి జోలికి పోకుండా వుండడమే మంచిది. 'అందులో ఏముంది? ఇందులో ఏముంది?' అంటూ మన సంప్రదాయాల్ని- ఆచారాల్ని అవహేళన చేయటం- తేలిక చేసి మాట్లాడటం పెద్ద తెలివిగా అనుకోకు!" అంది తీవ్రంగా శాంత.

"నేనింకా ఏం మాట్లాడందే అంత ఫైరయిపోతావేం?" అంది నవ్వి.

"నువ్వేం చెప్తావో నాకు తెలుసు తల్లీ!"

"పోనీ... తనేం చెప్తుందో చెప్పనీయ్ శాంతా. 'వినదగు నెవ్వరు చెప్పిన...' అన్నట్టు... విని ఏదైనా మంచి వుంటే తీసుకుని... లేకపోతే వదిలిపెట్టేసరి!" అంది సుమతి.

"మీ అందరికీ అంత సరదాగా వుంటే విని తరించండి. నాకు ఇంట్రస్ట్ లేదు. పైగా బోలెడు వర్కుంది... నే వెళ్తాను." అంది శాంత.

"శాంతకు భయంలే సుమతీ! కొంతమంది అంతే! ఆలోచించటానికి, వాదించటానికి ఇష్టపడరు. తమ చుట్టూ బోలెడు వెలుతురున్నా చీకటినే కోరుకుంటారు. తాము నమ్మే సిద్ధాంతాలకి బలం తక్కువని తెలుసు."

"నాకెందుకు భయం? అందులో నిన్న చూశా! నెవర్.. నమ్మకం అనేది ఎవరో ఏదో అనగానే వీగిపోయేంత బలహీనమైంది కాదు. కాకపోతే ఇప్పుడు మనకు సమయం తక్కువ. అందులో ఇవాళ నాకు చాలా వర్క్ మిగిలిపోయివుంది." అంది శాంత.

"వుందిలేవోయ్ మహా నీకేపని. అక్కడికి మేమేదో వూరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటున్నట్టు. అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరా? అన్నట్టు మన ఆఫీసు పని గురించి నా దగ్గర ఫోజులు కొట్టకు!" అంది భారతి వదిలిపెట్టకుండా.

"అబ్బబ్బ... నీతో ఇదే తంటా.. ఏ విషయాన్నీ అంత తేలిగ్గా వదలవ్. బాప్‌రే... మీ ఆయన సహనానికి జోహార్లు!"

"థాంక్స్. నిజంగా మా ఆయన సహనవంతుడే. అసలు సహనం స్త్రీకి భూషణం అంటారు కానీ- వుండాల్సింది మగవాళ్లకేనోయ్. వాళ్లు కాస్త ఆవేశాన్ని, ఉద్రేకాన్ని అదుపులో వుంచుకుని సహనాన్ని ప్రదర్శిస్తే అప్పుడిన్ని అరాచకాలు, అత్యాచారాలుండేవికావు. ప్చ్... కానీ ఎంతసేపూ ఆడదాన్నే సహనం, సహనం అంటూ చంపుకు తింటారు కదా!"

"సరే... విషయం మార్చకు. 'సహనం ఎవరికుండాలి?' అన్న విషయం మీద మరోసారి లెక్చర్ ఇద్దువుగానీ... ముందు విషయానికిరా!" అంది శాంత.

"ఓ.కె... ఇందాక నీ మెళ్లో గొలుసు తీసివ్వమంటే ఎందుకట్లా ఫీలయ్యావో చెప్పు!"

"చెప్పానుగా! 'అది పవిత్రమైన తాళిబొట్టు..' అని."

"అయితే నీ మెళ్లోవున్న పాత గొలుసు తీయకుండానే కొత్తది చేయించుకున్నావా?"

"దీనికి బదులుగా... పసుపుతాడు... వేసుకున్నాను."

"పసుపుతాడా? అంటే మరో ప్రత్యా మ్నాయం..."

"ఔను.. పసుపులోని పవిత్రత అట్లాంటిది."

"ఆ భావన మనసులో వుంటే చాలదా?"

"మనసులో వుండబట్టే- అందులోనూ చూడగ ల్గుతున్నాం."

"అంటే మనసే ప్రధానమని ఒప్పుకున్నట్టేగా? అట్లాంటప్పుడు ఈ బాహ్యమైన అలంకారాలపై మోజు ఎందుకు? నీకూ- నీ భర్తకూ ఒకరిపై మరొకరికి నమ్మకం వుంటే చాలదా? ఇవన్నీ అవసరమా?"

"అవసరమే! నిద్రలేచినప్పట్నించీ ఎన్నో పన్లు చేస్తున్నాం. అవన్నీ అవసరమయ్యే చేస్తున్నామా?

ఈ శరీరానికి ఆకలి, నిద్ర మాత్రమే ప్రధానమని అంతటితో వూరుకుంటున్నామా?



ఎన్నో సుఖాలు, సరదాలు, కోరికలు... అలా విస్తృతమై మానవ జీవిత సరళే మారిపోయింది.

అందులో కుటుంబ జీవితం ఒకటి. ఒక ఆడ-మగ ఒకరికొకరు కట్టుబడి వుండాలంటే ఏదో ఒక బంధం- ఇద్దర్నీ విడదీయలేని అనుబంధం కావాలి... అదే తాళి! ఇప్పుడు నీ దృష్టిలో ఎగతాళి అయిపోయింది గానీ దీనికెంత చరిత్ర వుందో నీకు తెలుసా?"

"పెళ్లి.. దాని పుట్టుపూర్వోత్తరాలు!' అని ఓ మహానుభావుడు రాసిన పుస్తకం చదివితే నాకే కాదు- నీకూ జ్ఞానోదయమవుతుంది. అయినా నేనిప్పుడు దాన్ని గురించి కాదు మాట్లాడేది. తాళి మెళ్లో కట్టించుకున్నప్పట్నించి దానికేదో దైవత్వం ఆపాదించుకుని అది తీసినా, పొరపాటున తెగినా- పతిదేవుడికేదో హాని జరుగుతుందని భయపడి పోతూ ఎందుకిలా వణికిపోవటం? అసలు ఈ తాళి అనేది ఒక మత చిహ్నాం. ఒక సంప్రదాయం. పెళ్లి అయిందనటానికి ఒక గుర్తు మాత్రమే! అంతే! ముఖ్యంగా మనదేశంలో ఇది కొన్ని ప్రాంతాలకు చెందిన ఆచారం. ఇతర మతాలవాళ్లు, ఇతర దేశాల్లోనివాళ్లు ఈ 'తాళి' తగిలించుకోవటం లేదు. అంతమాత్రాన వాళ్లకేం అపకారం జరుగుతోంది? ఇలా ఎప్పుడైనా ఆలోచించావా?" అంది భారతి కాస్త తీవ్రంగా.

చర్చ మంచి రసకందాయంలో పడింది. ఇక్కడ భారతి, శాంతల గురించి కొంచెం చెప్పాలి. వీళ్లిద్దరూ ఒకేసారి జాబ్‌లో చేరటం- రోజూ ఒకే బస్సులో కల్సి ఆఫీసుకు రావటం వల్ల ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం ఏర్పడింది. వాళ్లు ఆఫీసులో జాయినయినప్పట్నించీ గమనిస్తున్నాను. ఇద్దరివీ విభిన్న దృక్పధాలు. శాంత వన్నీ పాతకాలపు ఆలోచనలు. నోములు, వ్రతాలు, గుళ్లూ-గోపురాలు- వగైరాలు ఇష్టం. భారతి ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. పాతకాలపు ఆచారాల్ని, సంప్రదాయాల్ని, మూఢ విశ్వాసాలక్రింద, దురాచారాల క్రింద జమకట్టి తీవ్రంగా విమర్శిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ వీళ్లిద్దరి మధ్య చర్చలూ- వాదనలూ జరుగుతూంటాయి. మామూలు సంసారాల్లోని ఈతి బాధలూ, పిల్లలూ, వంటలూ- పురుళ్లూ- పుణ్యాల లాంటివి కాక సమాజంలో ఏళ్ల తరబడి పాతుకుపోయివున్న నమ్మకాల మీద-

గుడ్డిగా అనుసరిస్తోన్న నేటి తరం స్త్రీల అజ్ఞానం మీద- సాంఘిక, రాజకీయ, ఆర్థిక విషయాల మీద అనేక అభిప్రాయాలు వాళ్లిద్దరి మధ్య దొర్లుతూ వుంటాయి. కొన్ని సరదాగా వుంటే మరికొన్ని వేడి వేడిగా వుంటాయి. అవన్నీ మేమంతా ఆసక్తిగా వింటూంటాం. కొన్ని విషయాల్లో భారతి అభిప్రాయాలు సహేతుకంగా అన్పించినా- ఒకోసారి శృతి మించి తాను పట్టిన కుందేలుకి మూడేకాళ్లు అన్న ట్లుగా సాగుతుంది ధోరణి. కొన్ని విషయాల్లో శాంత చాదస్తంగా మాట్లాడినా- మరికొన్ని సమయాల్లో ఎంతో తెలివిగా ఉదాహరణలు చెప్పి భారతి నోరు మూయిస్తూ వుంటుంది. ఇవాళ 'తాళి' గురించిన వాదన వేడిగా సాగుతోంది.

"లేదు భారతీ! నీ ఒక్కదానికే తెలివి, నాలెడ్జి వుంది పాపం. మావన్నీ మొద్దుబుర్రలు."

"అలా అని నువ్వే అనుకుంటే- ఇంక సమస్యే లేదు!"

"అతి తెలివి అంటే ఇదే! నాకే సమస్తం తెల్సునను కోవడం 'అహంభావం' అవుతుంది. ఇతర మతాల, దేశాలవాళ్లకు ఏ నమ్మకాలు లేవనుకోవడం అజ్ఞానం కాదా? నేను కాదు... నువ్వే ఆలోచించి చూడు. ఏ మతానికి తగ్గ నమ్మకం దానికి, ఏ దేశానికి తగ్గ సంప్రదాయం దానికి వున్నాయి. అది 'తాళి' రూపంలో వుండకపోవచ్చు- అంతమాత్రాన వాళ్లకేం సెంటిమెంట్స్ లేవనుకోకు. పైగా వాళ్లు మన కంటే ఎక్కువగా గౌరవిస్తూ తు.చ. తప్పకుండా ఆచరిస్తున్నారు. అంతెందుకు? ముస్లిమ్స్, క్రిస్టియన్స్‌లో చాలామంది బొట్టు పెట్టుకోరు. 'ఇదేమిట'ని తెగబడి వాళ్లు దాన్ని వ్యతిరేకిస్తున్నారా? మనలోనే తెలివి ఇలా వెర్రితలలు వేస్తోంది. తన జాతిని, సంస్కృతిని, దేశాన్ని అభిమానించి ప్రేమించని వ్యక్తి- తన అహంభావాన్ని తప్ప దేన్నీ అంగీకరించడు. ముఖ్యంగా నీలాంటివాళ్లు అందరూ అంగీకరించినదాన్ని- వ్యతిరేకించడంలో ఆనందిస్తారు. అందరి మధ్యా తమకొక గుర్తింపు రావాలనే తాపత్రయం ఇది... అంతే!" అన్నది శాంత ఆవేశంతో.

"చాలా ఆవేశం వొలకపోసి- అలసిపోయావ్ పాపం! కానీ నీ వాదనలో ఏమాత్రం బలంలేదు సుమా! ఎందుకు? ఏమిటి? ఇది ఎంతవరకు సమర్థనీయం? అనే ఆలోచన లేకుండా గొర్రెల మందలా ప్రతిదాన్నీ అనుసరించిపోవటం అనేది విజ్ఞుల లక్షణంకాదు. అదే నిజమైతే మనం ఈనాడు ఇట్లా ఆఫీసులో కూర్చుని మాట్లాడే పరిస్థితి వుండేది కాదు. వంటిళ్లల్లోనే మగ్గిపోతూ వుండేవాళ్లంకాదా? ఆడది గడపదాటకూడదనే సంప్రదాయం ఒకప్పుడు వుం కుండేది కాదా? దాన్ని అతిక్రమించలేదా? నువ్వన్నా ముస్లిం మహిళల్లో కూడా బురఖాలు తప్పించు కుని సమాజంలో తాము స్వేచ్ఛగా సంచరించాలని ఉవ్విళ్లూరుతున్నారని మనం వింటూనే వున్నాం బానిసత్వం, బంధన అనేది ఏ ప్రాణీ ఇష్టపడదు స్వేచ్ఛలోవున్న ఆనందం, బలం అనుభవంలోకొచ్చాక మరి దేనితోనూ రాజీపడలేరు- తెలుసా?"

"నీ అభిప్రాయాలు నీవి. నా అభిప్రాయాలు నావి. నేనిలా వుండటంలోనే నాకు సంతృప్తి. నమ్మకం.. శాంతి. దీన్ని అతిక్రమించి- రేపేదైనా జరగరానిది జరిగితే దాన్ని భరించే శక్తి నాకు లేదు." అంది శాంత.

"జరగరానిదేదైనా జరుగుతుందేమో' అన్న భయాన్ని జయించ లేకపోతున్నానని ఒప్పుకో. నేనూ వదిలేస్తానింతటితో. మిగతా మాటలన్నీ అర్థంలేనివి. నీ పరిభాషలో చెప్పాలంటే- 'ఎలా జరగాలని రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది. దానికి ఎవరూ కర్తలు కారు.' అవునా. మరి ఈ చెత్తంతా ఎందుకు? దీనివల్ల ఇలా జరిగిందేమో- దీనివల్ల అలా జరుగుతుందేమో అనేవన్నీ మానసిక పరమైన భ్రాంతులు. అంతే!"

మధ్యలో సుమతి కల్పించుకుని- "మనం ఎన్నో ఆభరణాలు ధరిస్తున్నాం కదా భారతీ! ఈ మంగళ సూత్రం కూడా అందమైన ఒక డిజైన్ అనుకోవచ్చు కదా? దీనికింత రాద్ధాంతం దేనికి?" అన్నది.

"అయ్యో... పిచ్చి సుమతీ! అందాలూ-అలంకారాలూ ఇలాంటి వాటివల్ల తెచ్చుకునేవి కావు. మన వ్యక్తిత్వంవల్ల- ప్రవర్తనవల్ల వచ్చేవే అసలైన అలంకారాలని మన పెద్దవాళ్లు ఎప్పుడో చెప్పారు. మళ్లీ నేను ఉటంకించాలా?" అంది భారతి.

"చూడండి! నేనోమాట చెప్పనా?" అన్నాను.

ఏమిటన్నట్లు అంతా నావైపు చూశారు.

"మీరెన్ని రకాలుగా వాదించి, తీర్మానాలు చేసినా సమాజంలో పాతుకుపోయిన ఈ నమ్మకాన్ని అంగుళమైనా కదిలించలేరు. దేశానికో సంస్కృతి, ప్రాంతానికో సంప్రదాయం! ఏదైనా ఒక్కరోజుతో పుట్టుకొచ్చింది కాదు. అలాగే ఒక్కరోజుతో పోదు. పైగా ఇలాంటి నమ్మకాలు ఈమధ్య ఇంకా పెరుగుతున్నాయ్. ఏ మార్పు అయినా నెమ్మదిగా మొదలౌతుంది. దానికి మొదటి మెట్టు ఆలోచించటం. పాత గాథలకు కొత్త వ్యాఖ్యానాలు చెప్పుకోవాలి. అప్పుడుగానీ నూతన చైతన్యం ఆవిర్భవించదు. అలాగే ప్రతిదాన్నీ వ్యతిరేకించటం కాదు అందులో దాగివున్న మంచి గురించి ఆలోచించాలి. అలాగే ప్రతిదాన్నీ అంగీకరించటం కాదు. అందులో మనం నష్టపోయేదేమన్నా వుందేమో ఆలోచించాలి. అప్పుడుగానీ జీవనరథం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగదు."

★



## సదా ఆశ

కొంతమంది హీరోయిన్స్ వెరైటీ డైలాగులతో ప్రచారం పొందుతారు. 'జయం' సినిమాతో యువతరం అభిమానాన్ని చూరగొన్న సదా ఇప్పుడు బాగా బిజీ అయిపోయింది. జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి నటించిన 'నాగ' ఆమెకి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు తమిళంలో నిర్మిస్తున్న అదే జయంలో నటిస్తోంది. ఎడిటర్ మోహన్ తనయుడు రాజా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రవి హీరో, కాగా ఒరిజినల్ జయం చిత్రంలో హీరోయిన్ అయిన సదా ఇక్కడా అదే పాత్రని పోషిస్తోంది. తెలుగులో విలన్‌గా చేసిన గోపిచంద్ మళ్లీ అదే పాత్రలో తమిళ ప్రేక్షకుల్ని అలరించబోతున్నాడు. ఆర్.పి. పట్నాయక్ ఈ డబ్బింగ్ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. తెలుగులోలాగే తమిళంలో కూడా ఈ చిత్రం బంపర్‌హిట్ అవుతుందని ఆశతో ఉంది సదా.

– రాజా

